# విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :

8328649322, 9398236146.



TGTEL/25/A0977

# తొవ్వ

సాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 330 | సోమవారం 07-07-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.


## యాదగిరిగుట్టలో శాస్త్రోక్తంగా తొలి ఏకాదశి పూజలు

### వేములవాడలో రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి



**యాదగిరిగుట్ట, వేములవాడ కల్చరల్, జూలై 6:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అ?ధిష్టింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వివిధ రకాల పుష్పాలతో వైభవంగా లక్ష పుష్పార్చన చేపట్టారు. అర్చకులు తొలి ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు. 40వేలమంది భక్తులు క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ ఖజానాకు రూ. 57,28,842 ఆదాయం సమకూరింది. కాగా, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజరాజేశ్వర స్వామివారితో పాటుగా పరివార దేవతలకు అభిషేకం, అర్చనలు చేశారు.

# డిజిటల్ హైవేలు!

**జాతీయ రహదారులు ఇక స్మార్ట్‌గా..**

**రోడ్లపై ఏఐతో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటు**

**రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం**

**ప్రమాదాలు జరిగితే వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు లొకేషన్, కి.మీ. నంబర్‌తో సహా వివరాలు**



**హైదరాబాద్, జూలై 6:** జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త చర్యలు తీసుకుంటోంది. రోడ్డుపై నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిని నియంత్రించేలా దేశంలోని పలు జాతీయ రహదారులను డిజిటల్, స్మార్ట్ హైవేలుగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణ పరిధిలో ఉన్న పలు కీలక రహదారులను కూడా డిజిటల్, స్మార్ట్ రోడ్లుగా మార్చనుంది. ఈ మేరకు ప్రతి రోడ్డుపైనా అత్యంత అధునాతనమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో అనుసంధానం చేయనున్నారు. ఏఐతో అనుసంధానమైన కెమెరా వ్యవస్థను రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసం?ధానం చేస్తారు. దీంతో రోడ్డుపై వాహనం ఎలా వెళ్తోంది, ఎంత స్పీడ్‌తో వెళ్తోందనే విషయంతోపాటు సవ్య దిశలోనే వెళ్తోందా, లేదా అనేదీ తెలిసిపోతుంది. తద్వారా.. నిబంధనలను ఉల్లంఘించి వాహనం నడిపిన వారికి జరిమానా పడడంతోపాటు వాహన ప్రయాణ వీడియో కూడా ఫోన్‌కు వచ్చేస్తుంది. ఇప్పటికే ఢిల్లీ-గురుగ్రామ్‌ను కలిపే ద్వారక ఎక్స్‌ప్రెసవేపై ఏఐతో పనిచేసే సాంకేతిక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇదే విధానాన్ని దేశంలోని ఇతర రహదారులతోపాటు తెలంగాణలోనూ అమలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్రంలోనూ డిజిటల్ హైవే పనులు అమల్లోకి వచ్చాయి. ప్రస్తుతం మొదటి దశలో భాగంగా హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గం (ఎన్.హెచ్-44)లో స్మార్ట్ హైవే విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇది మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వరకు మొత్తం 591 కిలోమీటర్లు ఉంటుంది. తెలంగాణ పరిధిలో 251 కిలోమీటర్లు ఉంది. ప్రస్తుతం ఇది టోల్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (టీవోటీ) విధానంలో ఉంది. ఈ మొత్తాన్ని డిజిటల్ హై వేగా మార్చనున్నారు. తాజాగా ఈ బాధ్యతలు దక్కించుకున్న ఓ సంస్థ.. పనులు కూడా ప్రారంభించింది.

## ఏకలవ్య భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

**ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి:ఎమ్మెల్సీ కవిత**



**కవాడిగూడ, జూలై 6:** ఏకలవ్య భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ మొదలుపెట్టిన ఏకలవ్య భవన నిర్మాణాన్ని పూర్తిచేయలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురంభీం విగ్రహం వద్ద ఏకలవ్య జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్ర మానికి కవిత హాజరై ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. తెలంగాణ ఏర్పడిన తరువాత నాటి సీఎం కేసీఆర్ ఎరుకల కులస్థుల అభివృద్ధి కోసం ఎంపవర్మెంట్ స్కీంను ప్రవేశపెట్టారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని తుంగలో తొక్కిందన్నారు. తాను శాసనమండలిలో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చలనం లేదని విమర్శించారు. 50వేల ఎరుకుల కుటుంబాలకు రూ.60కోట్ల మేర లబ్ధి చేకూర్చే పథకాన్ని మెరుగుపరిచి ప్రభుత్వం యధాతథంగా అమలు చేయాలన్నారు. రూ.500 కోట్లతో ఎరుకుల కార్పొరేషన్‌నూ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

# బిహార్‌ను నేరాల రాజధానిగా మార్చేశారు..



న్యూఢిల్లీ: పాట్నాలో వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా హత్యకు గురికావడంపై బిహార్ ప్రభుత్వాన్ని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ (%ఘష్ట్రబశ్రీ +ఘఅఎష్ట్రఊ%) తీవ్రస్థాయిలో తప్పుపట్టారు. దేశంలో బిహార్‌ను నేరాల రాజధానిగా బీజేపీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మార్చారని రాహుల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో నేరాలు సర్వసాధారణంగా మారిపోయాయని అన్నారు. ప్రజలను కాపాడుకోలేని ప్రభుత్వానికి ఓటు వేయద్దని విజ్ఞప్తి చేశారు. రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికలు కేవలం ప్రభుత్వాన్ని మార్చే ఎన్నికలే కాదని, బిహార్ ప్రభుత్వాన్ని కాపాడుకునే ఎన్నికలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు. గోపాల్ ఖేమ్కా శుక్రవారం రాత్రి తన నివాసం వద్ద దారుణ హత్యకు గురయ్యారు. ఖేమ్కా కారు దిగుతుండగా బైక్‌పై వచ్చిన అగంతకుడు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఖేమ్కా మృతి చెందారు. ఖేమ్కాకు మగధ్ ఆసుపత్రి సహా పలు పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఆయన కుమారుడు ఒక భూమి తగాదాలో హాజీపూర్‌లో ఏడేళ్ల క్రితం హత్యకు గురయ్యాడు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ఖేమ్కా హత్య రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది.దీనిపై రాహుల్ తీవ్ర విమర్శలు చేస్తూ.. వ్యాపారవేత్త హత్యతో బీజేపీ, నితీశ్ కుమార్ కలిసి బిహార్‌ను నేర రాజధానిగా మార్చినట్టు నిరూపణ అయిందన్నారు. లూటీలు, బుల్లెట్లు, హత్యల నీడలో బిహార్ బిక్కుబిక్కుమంటూ బతుకుతోందని విమర్శించారు. రాష్ట్రంలో నేరాలు సర్వసాధారణంగా మారాయని, ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. 'సోదర సోదరీమణులారా.. అన్యాయాన్ని ఇంకెతమాత్రం సహించకూడదు. ప్రజలను కాపాడలేని ప్రభుత్వం మీ పిల్లల భవిష్యత్తును పరిరక్షించలేదు. ప్రతి హత్య, లూటీ, బుల్లెట్ కూడా మార్పును ఆకాంక్షిస్తున్నాయి. ప్రగతి, నిర్భీతి జీవనానికి భరోసా ఇచ్చే సరికొత్త బిహార్‌ను రూపొందించేందుకు ఇదే తగిన తరుణం. ఇవి కేవలం ప్రభుత్వాన్ని మార్చే ఎన్నికలు కావు, బిహార్‌ను కాపాడుకునే ఎన్నికలు' అని రాహుల్ అన్నారు.

# కుంగే బ్యారేజీలకు నీళ్లు ఎత్తిపోయాలా?



- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హరీశ్ యత్నం
- రైతులు బాగుంటే ఓర్వలేకపోతున్నారా? - రికార్డు స్థాయిలో వరి పంట సాగయింది
- ఇప్పటికైనా అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలి: ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 6:** "అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలు ప్రమాదకరంగా ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎసఏ) హెచ్చరించింది. అయినా సరే, కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు పదే పదే మాట్లాడుతున్నారు. దీని వెనుక ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర తప్ప రైతులకు మేలు చేసే ఉద్దేశం లేదు. కుంగే బ్యారేజీలకు నీళ్లు ఎత్తిపోయాలా?" అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పానలనో రైతులు బాగుంటే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. గతంలో మేడిగడ్డ బ్యారేజీ నుంచి అన్నారం, సుందిళ్ల, అక్కణ్నుంచి ఎల్లంపల్లికి లిఫ్ట్ చేసిన 160 టీఎంసీలలో దాదాపు 57 టీఎంసీల నీళ్లు మళ్లీ గేట్లు ఎత్తి సముద్రానికి పంపించి ప్రజాధనాన్ని గోదాట్లో పోసిన విషయం మరిచిపోయారా..? అని ప్రశ్నించారు.

## 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**కొత్తగూడెం, హైదరాబాద్ జూలై 6 :** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించామని, బఫర్ కింద మరో 1,500 ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో నియోజకవర్గానికి చెందిన 2,500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందచేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడు తూ.. పేదరిక నిర్మూ లనే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను ఎన్నికల్లో ప్రచా రానికి మాత్రమే వాడుకుని ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాగా, రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మన్ననూర్, ఏటూరునా గారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలోని 21 నియోజకవర్గాల్లో 13,266 చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటా యించామని మంత్రి పొంగులేటి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తొలి విడతలో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలోని మన్న నూర్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి చెంచులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందించ నున్నట్టు ఆయన పేర్కొన్నారు.

## నేడు భారీ, రేపు అతి భారీ వర్షాలు



**హైదరాబాద్, జూలై 6:** రాష్ట్రంలో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం అక్కడక్కడ ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడతాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫా బాద్, మంచిర్యాల జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక పెద్దపల్లి, భూపాలపల్లి, జగిత్యాల, నిజామాబాద్, కరీంన గర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ నెల 12 వరకు రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

## కాంగ్రెస్ పాలనలో ఎరువులకూ కరువే..!

**ఎరువులను బుక్కేస్తున్న మేతన్నలెవరో తేల్చాలి: కేటీఆర్**



**హైదరాబాద్, జూలై 6:** కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదని.. రైతు భరోసా, రైతు రుణమాఫీ హామీలు ఎగ్గొట్టడమే కాకుండా ఇప్పుడు ఎరువులకు కూడా తీవ్రమైన కరువు ఏర్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అప్పుతెచ్చి వ్యవసాయం చేద్దామన్నా.. కనీసం ఒక ఎరువుల బస్తా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల లోటు ఎందుకు ఉందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. రూ.266కు అందుబాటులో ఉండాల్సిన యూరియా బస్తా ధర ఇప్పుడు రూ.325కు చేరిందని, ఇందుకు కారణం ఏమిటని నిలదీశారు. కృత్రిమ కొరత సృష్టించి.. ఆఖరికి ఎరువులను కూడా బుక్కేస్తున్న మేతన్నలు ఎవరో తేల్చేందుకు తక్షణం విచారణ జరిపించాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కన్నెపల్లి నుంచి నీళ్లివ్వండి


## మేడిగడ్డ పిల్లర్లు కుంగాయన్న సాకు వద్దు

**రాష్ట్ర రైతాంగానికి నీళ్లిచ్చి ఆదుకోవాలి**

**లేదంటే కేసీఆర్ ఆధ్వర్యంలో నీటి మోటార్లను నడిపిస్తాం**

**అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగానే ఉన్నాయని ఉత్తమ్ చెప్పారు**

**నీళ్ల విలువ తెలియని పాలకుల వల్లే ఇబ్బందులు: హరీశ్ రావు**



**హైదరాబాద్, జూలై 6 :** "మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగినాయన్న సాకుతో కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని పడావు పెట్టారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు తీసుకునే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఇంజనీర్లే చెప్తున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని మోటర్లు ఆన్ చేయకుండా రైతులను గోస పెడుతోంది. ఇప్పటికైనా స్పందించి తక్షణమే కన్నెపల్లి, కల్వకుర్తి పంపులను ఆన్ చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలి. లేకపోతే కేసీఆర్ నాయకత్వంలో లక్షలాది మంది రైతులందరం కలిసి మోటర్లు ఆన్ చేస్తాం" మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 36 రోజుల క్రితమే శ్రీశైలానికి వరద మొదలవ్వగా.. ఇప్పటికీ కల్వకుర్తి మోటార్లను నడపడం లేదని మండిపడ్డారు. కళ్లముందు నీళ్లు పోతుం టే పట్టించుకోని ప్రభుత్వం తీరు నేరపూ రితంగా ఉందన్నారు. పదే పదే తాను పాల మూరు బిడ్డను అని చెప్పుకునే ముఖ్య మంత్రి, అక్కడి రైతుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. గత ఏడాది ఆ ప్రాంత రైతులకు క్రాప్ హాలిడే...ప్రకటించి ఆంధ్రలో మూడో పంటకు నీళ్లు వది లారని, ఈసారీ ఆంధ్రకు నీళ్లొదిలే ప్రయత్నం చేస్తున్నా రన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణా జల్లాలో అతి తక్కువ నీళ్లు వాడుతున్నది రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని, చంద్రబాబుతో రేవంత్‌కు ఉన్న చీకటి ఒప్పందం ఏంటో చె ప్పాలని డిమాండ్ చేశారు. నీళ్ల విలువ తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉంటే ఆ నీళ్లను మలుపుకొనే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటారని చెప్పారు. కానీ నీళ్ల విలువ తెలియని నాయకులు మన పాలకులుగా ఉండటం వల్ల రైతాంగం తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని దుయ్యబట్టారు.

# పట్టాలివ్వండి పొంగులేటి సారు

**నారాయణపురం గ్రామంలో చిన్నారుల వినూత్న నిరసన.**

**మా గ్రామానికి పట్టాలివ్వాలని రిలే నిరాహార దీక్షలో కూర్చున్న చిన్నారులు**



**తొవ్వ, కేసముద్రం, జూలై 06:**
మా గ్రామానికి పట్టాదారు పాస్ పుస్తకాలు పట్టాలివ్వండి పొంగులేటి సారు..! అంటూ కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామంలో రిలే నిరాహార దీక్షలో చిన్నారులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి నాయక్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలనే రైతన్నలకు తిప్పలవుతున్నాయని మండిపడ్డారు. ఎంజాయ్ మెంట్ సర్వే ప్రకారం తమ వ్యవసాయ భూములకు పట్టాలు ఇవ్వాలని నారాయణపురం గ్రామంలో చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆరు రోజులకు చేరింది. ప్రభుత్వాలు మారిన ఫలితం మాత్రం శూన్యంగా ఉందని పాలకులు రైతులకు పట్టాలి ఇస్తానని హామీలు ఇవ్వడం తప్ప పనిలో మాత్రం ఫలితం లేకపోయిందని ఆవేదన చేపట్టారు. రైతులకు ,రైతు భరోసా ఇతర ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పాలకులు స్పందించి, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడి మా గ్రామ రైతులకు ఎంజాయ్మెంట్ సర్వే ప్రకారం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. 2025 ఫిబ్రవరి, మార్చి నెలలో ఎంజాయ్ మెంట్ సర్వే లిస్టును నేటి వరకు ప్రచురించలేదని, టి ఎం 33 కింద 145 దరఖాస్తులు సుమారు 400 ఎకరాలు 2022 నుండి దరఖాస్తులు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో పెండింగ్ ఉన్న, ఎంజాయ్ మెంట్ సర్వేలో లేని రైతుల పేర్లు దాదాపు 80 ఎకరాలు భూమి రెవెన్యూ రికార్డులో నమోదు చేశారని,తొలగించాలని రెండు సంవత్సరాల నుండి అధికారులకు మొరపెట్టుకున్న పట్టించు కోవడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోకి వచ్చిన తర్వాత జీవో నెంబర్ 94 ఇచ్చిన సుమారు 90 ఎకరాలు రైతు పేరు తండ్రి పేరు అడవిగానే ఉందని జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యంవీడి రైతులకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ధరావత్ రవి, వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, రాంరెడ్డి, వెంకట్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ఉపేందర్,యాదగిరి,రమేష్, లక్ పతి మల్లయ్య, రవి, దేవేందర్, హరిలాల్, అనిల్, అనిత, రాణి, స్వప్న, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ వర్గాలకు దాసోహం అంటున్న కేంద్ర ప్రభుత్వం

**ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మాట్లాడుకోవటానికి వేదిక ఉంది**

**ప్రజల హక్కులను కాలరాస్తున్న ఆదాని అంబానీలు**

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రం - సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు**



**తొవ్వా న్యూస్ ప్రతినిధి, కురవి జూలై 6,**
కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహం అంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఆదాని అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెలపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మూడవ మహాసభల్లో భాగంగా రెండో రోజు పోగుల శ్రీనివాస్ గౌడ్ ప్రాంగణంలో సీనియర్ నాయకులు దూదికట్ల సారయ్య అరుణ పతాక ఆవిష్కరించగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మరిపెడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి స్వాగత ఉపన్యాసం చేశారు. అనంతరం అమరులైన నాయకులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికార ప్రతిపక్ష నాయకులు తొడలు కొట్టుకొని రోడ్ల మీదకు రా మాట్లాడుకుందాం అని సవాళ్లు విసురుకుంటుంటే కోట్ల రూపాయల పెట్టి కట్టిన అసెంబ్లీ, సెక్రటేరియట్ ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్షం అడిగే తీరుగా అడగాలి పాలకపక్షం జవాబు చెప్పాలి అని ఆయన ముక్కు సూటిగా అన్నారు. ప్రతిపక్షం తప్పులు చేయకపోతే ఎందుకు అంత ఉలిక్కిపాటు అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అధికమైన సబ్సిడీలు ఇస్తూ దేశ సంపదలను వారి చేతిలో పెట్టి ప్రభుత్వాన్ని పాలిస్తుందని, కార్పొరేట్ శక్తులు అన్నట్లుగా మోడీ ప్రభుత్వం తలువుపుతూ వారికి దాసోహం అంటూ ఉన్నదని ఆయన మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. బిజెపి అధికారంలో వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తూ లక్షల కోట్ల రూపాయలను రాయితీలు ఇస్తూ ప్రజాస్వామ్య గొంతును ప్రజల గొంతుకను అనిచి వేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని తుంగలో తొక్కాలని ఆయన అన్నారు. కేంద్రంలో జాతీయ వాదం పేరుతో హిందుత్వం ఎజెండాతో ముస్లిం క్రిస్టియన్లను కమ్యూనిస్టులపై ఉసిగొలుపుతూ ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని, రచయితలను కవులను కళాకారులను విద్యావేత్తలను అణిచివేస్తున్నారని ఆయన ఆక్రోషం వ్యక్తం చేశారు. రోజు రోజుకి నిరుద్యోగం ఆకలి దారిద్రం నిరంతరం పెరుగుతూ పేదలకు విద్యా వైద్యం అందక ప్రజలు ఆందోళనకు గురవుతున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను అంతం చేస్తూ మావోయిస్టులను మట్టుపెట్టామని చెబుతుందని ఆదివాసీలు మావోయిస్టులకు మద్దతుగా ఉన్నారనే కసితో మోడీ ప్రభుత్వం ఆదివాసీలను మిల్ట్రీ గ్రహాండ్ బలగాలతో చంపుతుందని అన్నారు. ఆపరేషన్ కగారుతో మారణకాండను సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నక్సలైట్లను హతం చేస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాక్షస ఆనందం పొందుతున్నాడని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణలను విద్యార్థి సంఘాలు మేధావులు రాజకీయ వర్గాలు ఐకమత్యంగా ఉండి వ్యతిరేకించాలని కోరారు. బి కురవి మండల కేంద్రంలో గుడిసెలు వేసుకున్న పేదవారికి ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. డోర్నకల్ శాసనసభ్యులు శాసనసభ ఉపసభాపతి డాక్టర్ రామచంద్రనాయక్ పేదల వేసుకున్న గుడిసెలను పరిశీలించి వాటి స్థానాల్లో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఆయన కోరారు. బిబిబిపత్రిక విలేకరులకు ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి వారిని ఆదుకోవాలని అన్నారు. రెండవ రోజు జరిగిన డెలిగేట్ల మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి పార్టీ వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. దేశపల్లి నవీన్. మామిళ్ళ సాంబలక్ష్మి. తురక రమేష్. వెలుగు శ్రావణ్. అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి. రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మినేని విశ్వేశ్వరరావు. రాష్ట్ర సమితి సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి అజయ్. నాయకులు పెరుగు కుమార్. చింతకుంట్ల వెంకన్న. రేషపల్లి నవీన్. కర్ణం రాజన్న. నెల్లూరు నాగేశ్వరరావు. పాండురంగాచారి. వరిపల్లి వెంకన్న. జంపాల వెంకన్న. చొప్పరి శేఖర్. బుర్ర సమ్మయ్య. నరసింగం గురవయ్య. బొల్లు వెంకన్న. తదితరులు పాల్గొన్నారు.

# దేశ రక్షణ కోసం జూన్ 9 న జరిగే ఐక్య ఉద్యమంలో పాల్గొని జయప్రదం చేద్దాం

**మాటూరి బాలరాజు రైతు సంఘం జిల్లా కార్యదర్శి**



**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధి: జులై 06**
కార్మిక, రైతు,ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జూన్ 9న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు,రైతులు, వ్యవసాయ కార్మికులు,ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ లు పిలుపునిచ్చారు ఆదివారం రోజున మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో తుర్కపల్లి సురేందర్ అధ్యక్షతన ప్రజాసంఘాల పోరాట వేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలరాజు, స్వామి,సురేందర్ లు మాట్లాడుతూ మాట్లాడుతూ కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెట్టేందుకే బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా 44 కోట్ల మంది కార్మికులు బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సార్వత్రిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, అధిక ధరలు తగ్గించాలని, ఉపాధి హామీ చట్టం రక్షణకు, మహిళలపై జరుగుతున్న దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ అన్ని వర్గాల ప్రజలు సమ్మెలో భాగస్వామ్యం కావాలని అన్నారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులను తీసుకురావడం కోసం మోడీ ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. దేశాన్ని కాపాడేందుకు కార్మికులు, కర్షకులు ఐక్యమై సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందడి సత్తిరెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం, ఐద్వా మండల కార్యదర్శి బూడిద మనమ్మ, ప్రజానాట్యమండలి మండల అధ్యక్షులు రాధారపు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు కొమ్ము స్వామి,కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పలుసం స్వామి,ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, కెవిపిఎస్ మండల అధ్యక్షులు వేముల అమరేందర్, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షులు కొండే నరసింహ,వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు కలుకూరి ముత్యాలు,చేగురి నగేష్,ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మైసొల్ల నరేందర్, తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి



**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తోవ ప్రతినిధి : జులై 06**
రామన్నపేట పట్టణ కేంద్రంలోబిజెపి ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమైక్య భారతావని కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు అని అన్నారు .వారి ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బెజ్జంకి శివకుమార్ చారి సీనియర్ నాయకులు గోపగోని ధర్మరాజు ఉపాధ్యక్షులు బట్టే రమేష్ శక్తి కేంద్రం ఇన్చార్జి ముగ్గు నరసింహ భాషకర్ల నరేందర్ రెడ్డి కటిక శీను నోముల శ్రీనివాస్ నల్లబోతు మధు చిన్నపాక స్వామి కన్నుల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక మొహర్రం

**-తిరుమల ప్రభాకర్ రెడ్డి**



**బయ్యారం,తోవ్వ,జులై 6.**
దయ,కరుణ,శాంతికి ప్రతీక మొహర్రం అని కాంగ్రెస్ నాయకులు సోసైటీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మొహర్రం సందర్భంగా ముస్లింలకు మొహర్రం శుభాకాంక్షలు తెలియజేశారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ అలైహిస్సలాం బలిదానానికి గుర్తుగా నిర్వహించుకునే ఈ మొహర్రంను ముస్లిం సోదర సోదరీమణులు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తిరుమల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మొహర్రం స్ఫూర్తిగా మానవతావాదానికి పునరంకితం కావాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు

**-సూరం సుధాకర్ రెడ్డి**



**బయ్యారం,తోవ్వ,జులై 6.**
స్వాతంత్ర్య సమరయోధులు,దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు సూరం సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. దళితులు,వెనుకబడిన తరగతులు, అణచివేతకు గురైన వర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్ రామ్ అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. దేశానికి ఆయన అందించిన సేవలు నిరుపమానమని పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం పునరంకితం కావడమే మనం అర్పించే ఘన నివాళి అని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

**అఖిలపక్ష నేతలు ప్రభుత్వానికి వినతి**



**తొవ్వ, నెల్లికుదురు, జూలై 06**
జిల్లా కేంద్రమైన మహబూబాబాద్ కు డివిజన్ కేంద్రమైన తొర్రూరుకుమార్గ మధ్యలో ఉన్న నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కిడ్నీ సంబంధిత రోగులకు అవసరమైన డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటుచేసి బాధితులను ఆదుకోవాలని అఖిలపక్ష నేతలు పరిపాటి వెంకటరెడ్డి, ఇ సంపల్లి సైదులు, ఆలకుంట్ల సాయిలు, పెరుమాండ్ల బాబు గౌడ్ లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధికంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులు మండలంలోని ఎక్కువగా ఉన్నారని, వారు తరచూ డయాలసిస్ కు వెళ్లడం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి కోసం ప్రత్యేక చొరవ చూపి ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులైన ఎమ్మెల్యే ఎంపీలు డయాలసిస్ సెంటర్ ను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యం 50 మంది పేషెంట్లు మహబూబాబాద్, లేదా హైదరాబాద్ కు వెళ్లి చేయించుకోలేని పరిస్థితిలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తక్షణమే డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. లేనట్లయితే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు పెరుమాండ్ల పుల్లయ్య, ఇరుగు నాగన్న తదితరులు ఉన్నారు.

# మున్నేరు ప్రాజెక్టు నీటిని గార్ల,బయ్యారం

# డోర్నకల్ తదితర సమీప ప్రాంతాలకే ఇవ్వాలి

## -రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్



**బయ్యారం,తోవ్వ,జులై 6.**
మున్నేరు ప్రాజెక్టు ఈ ప్రాంత ప్రజల ఐదున్నర దశాబ్దాల కల అని, గార్ల, బయ్యారం, డోర్నకల్, కురవి, కామేపల్లి తదితర మండలాల సాగునీటి అవసరాల కోసం డిజైన్ చేయబడ్డ ప్రాజెక్టును ఇప్పుడు నక్కల పాలైనట్లుగా ఇక్కడ ఒక్క ఎకరానికి కూడా నీళ్ళివ్వకుండా పాలేరుకు తలళించుకపోవటం అత్యంత దుర్మార్గకరమైన చర్య అని వక్తలు విమర్శించారు.ఆదివారం బయ్యారం గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, టీజేఎస్ రాష్ట్ర నాయకులు గోపగాని శంకర్రావు, విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జంపాల విశ్వ ప్రసంగిస్తూ ఈ ప్రాంత ప్రజల డిమాండ్ మేరకు 1969లో ఆనాటి ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య ప్రాజెక్టు సర్వే కోసం 1 లక్షరూపాయలు కేటాయించారని, తర్వాత 1985లో తెలుగు దేశం ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ సర్వేకోసం 10 లక్షలు కేటాయించిందని,1995లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసిందని, 2009లో నాటి ముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం కోసం 136 కోట్లు మంజూరు చేస్తూ జీవో 1076ను విడుదల చేశారని అన్నారు.వైఎస్ఆర్ మరణంతో ఈ ప్రాజెక్టు మూలన పడిందని, కీ.శే. టంగుటూరి అంజయ్య నుండి వైయస్ రాజశేఖర్ రెడ్డి వరకు చంద్రగిరి, రెండేర్లగడ్డ, మున్నేరు పేర్లతో ఈ ప్రాజెక్టు కోసం జరిగిన సర్వేలు, ప్రతిపాదనలన్నీ ఈ ప్రాంత ప్రజల సాగునీటి, తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించినవేనని వారన్నారు.ఇప్పుడు హఠాత్తుగా మే 17, 2025న రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 98 ద్వారా మున్నేరు ప్రాజెక్టు నిర్మాణానికి 162.54 కోట్లు కేటాయించిందని. ఈ ప్రాజెక్టును సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పాలేరు లింకు కెనాల్ కు అను సంధానం చేసి 10 టీఎంసీ ల నీటిని పాలేరు రిజర్వాయిర్ కు తరళించనున్నట్లు,తద్వారా అ రిజర్వాయర్ కింది వున్న 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారని అన్నారు.100 ఏండ్ల క్రితం నిర్మించబడిన పాలేరు రిజర్వాయర్ కు కృష్ణా నది జలాలు అనుసంధానం చేయబడ్డాయని,ఇప్పుడు గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నీటిని పాలేరు రిజర్వాయర్ కు ఇవ్వడానికి లింక్ కెనాల్ పనులు వేగంగా జరుగు తున్నాయని, క్రిష్ణా, గోదావరి నదుల నీళ్ళు కూడా సరిపోక నూతనంగా పాకాల, బయ్యారం చెరువు అలిగేరు నీళ్ళను కూడా పాలేరుకు తీసుకపోవటానికి నిర్ణయం తీసుకోవటం దుర్మార్గమైన చర్య అని వారన్నారు.ఎలాంటి సాగునీటి వసతులు లేక ఇబ్బందులు పడుతున్న ఈ ప్రాంత ప్రజలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్ళు యిస్తామని డీపీఆర్ కూడా పెట్టిన ప్రభుత్వం రీడిజైన్లో గార్ల, బయ్యారం మండలాలను తొలగించి సుదూర ప్రాంత్రాలకు, క్రిష్ణా నది ఆయకట్టు స్థిరీకరణకు గోదావరి జలాలను తీసుకెళుతూ ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారన్నారు.ఇప్పుడు మన తలాపున ఉన్న మన నీళ్ళను కూడా క్రిష్ణ ఆయకట్టు స్థిరీకరణ కోసం తీసుకెళ్తూ మన నోట్లో మన్ను కొడుతున్నారని, దీనిని తీవ్రంగా ఖండించాలన్నారు.మున్నేరు ప్రాజెక్టు జలాలు ఈ ప్రాంత ప్రజల సాగునీటి అవసరాలకే ఉపయోగపడాలని ఈ పాంత్రానికి అన్యాయం చేస్తూ పాలేరుకు తీసుకెళ్ళే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు.మున్నేరు ప్రాజెక్టు వీటిని గార్ల బయ్యారం, డోర్నకల్ తదితర పరివాహక ప్రాంత అవసరాలకు కేటాయించాలని,మున్నేరు జలాల రక్షణ కోసం ఐక్య పోరాటానికి ముందుకు రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈరౌండ్ టేబుల్ సమావేశంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, సీపీఎం జిల్లా నాయకులు మండా రాజన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాత గణేష్, మాస్ లైన్ మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యనారాయణ, టీడీపీ మండల నాయకులు నామా బాబురావు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భీముడు నాయక్,వివిధ పార్టీల నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు,మోకాళ్ళ మురళీ క్రిష్ణ, గుగులోత్ సక్రు, ఎనుగుల ఐలయ్య, నంబూరి మధు తదితరులు మాట్లాడారు.అనంతరం మున్నేరు ప్రాజెక్టు జలాల రక్షణ కోసం ఐక్య వుద్యమానికి పూనుకోవాలని తీర్మానం ఆమోదించారు.

# తాండవ కృష్ణ నృత్యాలయలో ఘనంగా ఆషాడ మాస గోరింటాకు సంబరాలు



**తోవ్వ, ప్రతినిధి. జులై 06**
తాండవ కృష్ణ నృత్యాలయ మహబూబాబాద్ ఆధ్వర్యంలో ఆషాడ మాసం గోరింటాకు సంబరాలు ఘనంగానిర్వహించారు.సుమారు 70 మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని... పురాతన పద్ధతిలో గోరింటాకును రోలులో రుబ్బి వారి చేతులకు అలంకరించుకున్నారు... ఆటపాటల ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.. ఈ కార్యక్రమంలో తాండవ కృష్ణ నృత్యలయ డైరెక్టర్ నాట్య శ్రీ ఉదయశ్రీ మాట్లాడుతూ"గత పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మహిళల చేతులకు గోరింటాకు పెట్టుకుంటే ఎంతో అందంగా ఉంటారు. గోరింటాకును కేవలం అందానికే కాకుండా ఆరోగ్యానికి, మహిళల పసుపు, కుంకుమకి ప్రతీకగా భావిస్తారని ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావు. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఈ మాసంలో ఎక్కువగా వర్షాలు పడతాయి. దీనివల్ల జలుబు, దగ్గు వంటి సమస్యలు వస్తాయి. అదే గోరింటాకు పెట్టుకుంటే ఇమ్యూనిటీ పవర్ పెరిగి ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని వర్షాకాలంలో మహిళలు ఎక్కువసేపు నీళ్లలో ఉండడం వల్ల కాళ్లల్లో చేతుల్లో ఫంగస్ ఫామ్ అవుతుందని గోరింటాకు ధరించడం ద్వారా ఎటువంటి ఫంగస్ ఫార్మ్ అవ్వకుండా ఉంటుందని అన్నారు"బిజెపి మానుకోట జిల్లా అధికార ప్రతినిధి "దార ఇందు భారతి" ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ " ఇంత మంచి కార్యక్రమం మహిళలందరూ జరుపుకోవడం హర్షనీయమని..అందరూ కలిసికట్టుగా మహిళలు ఏ కార్యక్రమాన్ని జరిపిన అది విజయవంతం అవుతుందని, మన సనాతన సంస్కృతి సాంప్రదాయాలు ముందు తరాల వారికి చేరాలంటే ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని అన్నారు"ఈ కార్యక్రమంలో తాండవ కృష్ణ నృత్యాలయ మహిళలు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా

# కొనుగోలు చేసినట్లైతే క్రిమినల్ కేసులు తప్పవు

## ఎస్ ఐ సురేష్



**తొవ్వ, నర్సింహులపేట, జులై. 06**
కొన్ని రోజుల నుండి వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు 1,00,000/- రూపాయల విలువ గల 4 ఫోన్ల ను గుర్తించి రికవరీ చేసి సంబంధిత మొబైల్ ఫోన్ల యజమానులకు (భాదితులకు) అందజేయడం జరిగిందని ఎస్ ఐ సురేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ ఐ సురేష్ మాట్లాడుతూ....ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యవసరమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్లైన్ విద్య కోసం వినియోగిస్తున్నాం, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్ లో నిక్షిప్తం చేసుకుంటున్నాము అన్నారు, మొబైల్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది. నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతుందన్నారు. సెల్ ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై DOT (డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీ-కమ్యూనికేషన్) CEIR పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈపోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందని ఎస్ ఐ సురేష్ వివరించారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే CEIR bþsÁ¼ýÙ ( https://www.ceir.gov.in ) నందు నమోదు చేసుకోవాలి, మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు, వినియోగదారులు ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ లను కొనుగోలు చేసినట్లైతే అట్టి షాప్ యజమాని నుండి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సెల్ ఫోన్ దొంగలు దొంగిలించిన ఫోన్ లను మొబైల్ షాప్ లలో అమ్ముతున్నారని, తక్కువ ధరకు వస్తుందని దొంగిలించబడిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు మోసాలకు గురి అవుతున్నారని అన్నారు. ఎవరైన దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసినట్లైతే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ మొబైల్స్ రికవరీ చేయడం కోసం పోలీసు శాఖ కృత నిచ్చయంతో పని చేసినారు, ఒక్కో ఫోన్ రికవరీ కోసం చాలా కృషి చేశారు, ప్రజల కోసం పోలీసు ఎప్పుడు అందుబాటులో అంటారు, సమస్యలు వస్తె పోలీసు సేవలు వినియోగించుకోవాలి, పోలీసులు మనకోసం అన్నారు అని భావన ప్రతి ఒక్కరిలో ఉండాలి అన్నారు.పోయిన మొబైల్ ఫోన్లు మళ్లీ దొరకదనుకున్న బాధితులు పోలీస్ టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంభందిత బాధితులు %హ×% సురేష్ గారికి మరియు పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీ గురుకులానికి పేరెంట్ కంచం అంజయ్య 50 ఫ్యాన్లు అందజేత



**తోవ్వ, రంగారెడ్డి,మొయినబాద్, జులై 6**
మొయినాబాద్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు శివ ప్రసాద్,లాలు ప్రసాద్, తండ్రి కంచం అంజయ్య ఎంజేపీ గురుకుల పాఠశాలకు 50 ఫ్యాన్లు అందజేశారు.వారికి ఎంజేపీ గురుకుల సెక్రెటరీ సైదులు, ప్రిన్సిపాల్ జంగం నరేష్ మరియు సిబ్బంది అతనికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ట్ టీచర్ రాజేష్, పీడీ శ్రీనివాస్, దేవులపల్లి రమేశ్, రాథోడ్ మోహన్, కిరణ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# జాతీయవాద దార్శనికులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ

## బిజెపి పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్



**తొవ్వ,కేసముద్రం,జూలై 05:**
కేసముద్రం మండల కేంద్రమైన జ్యోతిరావు పూలే సెంటర్ లో మంగళవారం జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భాన్ని పురస్కరి ంచుకొని జ్యోతిరావు పూలే సెంటర్ , వెటర్నరీ హాస్పిటల్ లోభారతీయ జనతా పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ నేతృత్వంలో మొక్కలు నాటారు. ఈ మేరకు పార్టీ శ్రేణులుడాక్టర్ శ్యాం ప్రసాద్ముఖర్జీ చిత్రపటానికిపూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మండల మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ మాట్లాడుతూ సమైఖ్య భారత వని కోసం గాను ప్రాణాలర్పించిన త్యాగధనుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు.పార్టీ శ్రేణులందరూ డాక్టర్ శ్యాం ప్రసాద్ముఖర్జీ ఆశయ సాధన కోసం గాను అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వోలం శ్రీనివాస్ ,జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొదిల నర్సింహ మండల ప్రధాన కార్యదర్శి బోగోజునాగేశ్వరచారి,గాంతి వెంకట్ రెడ్డి ,దొమ్మాటి దేవేందర్,జాటోత్ నరేష్, బెజ్జం సురేష్, పల్స రవీందర్ గౌడ్, సింగంశెట్టి మధు, లక్కాకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి త్యాగానికి ప్రతీక మొహర్రం

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**తోవ్వ, ఇబ్రహీంపట్నం. జులై 06**



మత సామరస్యానికి త్యాగాలకు ప్రతీక మొహర్రం పండుగ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు ఆదివారం ఆరుట్ల గ్రామంలో జరిగిన మొహర్రం వేడుకల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య మార సురేష్ ఎన్నిదుల సురేష్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి పాండాల శ్రీనివాస్ ఎండి గాలేబ్ రావుల నాగరాజు ఎండి అజీమ్ ఎండి జిలానీ ఎండి ఇమ్రాన్ ఎండి గఫార్ ఎండి జాఫర్ ఎండి అర్షద్ కుకుడాల నరేందర్ రెడ్డి పాండాల అఖిల్ తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి.

**తొవ్వ, ప్రతినిధి, నెక్కొండ, జూలై 06:**



నెక్కొండ మండలం టీ కే తండా కి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు అనిల్ నాయక్ ఇంటి భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రు. రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భక్కి అశోక్ నర్సంపేట కోర్టు ఏజీపీ అడ్వకేట్ బండి శివకుమార్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇదునూరి సాయికృష్ణ కుసుమ చెన్నకేశవులు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రావుల మహిపాల్ రెడ్డి రమేష్ గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఖర్చులతో కూడా కాలువ పూడికతీత
# పనులు ప్రారంభించిన టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు



**పెబ్బేర్**

పెబ్బేర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డ్ అంబేద్కర్ నగర్ కు చెందిన రైతుల పంట పొలాలకు నీరు ప్రవహించే ప్రధాన కాలువ పూర్తి గా శిథిలావస్థ కు చేరిచెట్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగి పొలాలకు నీళ్లు అందక ఇబ్బంది పడుతున్న రైతులు స్థానిక జిల్లా కాంగ్రెస్ నాయకులు గంధం రాజశేఖర్ దృష్టికి తీసుకు వెళ్ళగ తక్షణమే స్పందించిన నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆదేశాల మేరకు పెబ్బేరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్,తన సొంత ఖర్చులతో నేడు %జీజదీ% వాహనం తో కాలువ పూడిక తీత పనులను రైతులు కాంగ్రెస్ నాయకులతో వెళ్లి ప్రారంభించారు. ఎమ్మెల్యే గారికి దృష్టికి తీసుకువెళ్లి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేస్తామని రైతులకు భరోసా కల్పించారు.సమస్యకు సత్వర పరిష్కారం చూపినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, టౌన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గంధం సునీల్ కుమార్, మాజీ కౌన్సిలర్ అశ్విని సత్యనారాయణ మండల సీనియర్ నాయకులు యుగంధర్ రెడ్డి మైనార్టీ నాయకులు షకీల్, వినయ్,యువ నాయకులు గంధం ఉత్తమ్ 1 వార్డు అధ్యక్షులు అడ్డాకుల రాజు 2వ వార్డ్ అధ్యక్షులు గణేష్, యువ నాయకులు కురుమూర్తి ముదిరాజ్, రైతులు గంధం మొగులన్న, జామపల్లి అయ్యన్న, జామపల్లి కురుమన్న ఫకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇళ్ళు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం జులై 6**

కొత్తగూడెం గుడి లేని ఊరు ఉంటుందేమో కానీ.. ఏ గూడానికి, ఏ తండాకు, ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా ఇందిరమ్మ ఇల్లు మాత్రం ఉంటుందని, అది ఇందిరమ్మ ప్రభుత్వ గొప్పతనమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో సుజాత నగర్, చుంచుపల్లి, లక్ష్మిదేవిపల్లి, పాల్వంచ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ లతో కలిసి పంపిణి చేశారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం వాగుపై కోటి రూపాయల వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి, బంగారుచెలక చింతపెంటి గూడెం పారేటివాగుపై నాలుగు కోట్ల రూపాయల డీఎంఎఫ్టి నిధులతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతు గత పది సంవత్సరాలు పాలించిన నాయకులు 8 లక్షల 19 వేల కోట్ల అప్పులు చేశారని వాటికి వడ్డీలు కడుతూనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కొన్ని అమలు చేశామని రాబోయే రోజుల్లో మిగిలిన పథకాలు అమలు చేస్తామన్నారు. అర్హులైన వారికి రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు సన్న వడ్లకు 500 బోనస్, రేషన్ కార్డుకు సన్నబియ్యం లాంటి సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాన్నారు. కొద్దిరోజుల క్రితమే అర్హులైన రైతులందరి ఖాతాల్లో ఎకరానికి రూ. 12వేల చొప్పున తొమ్మిది వేల కోట్ల రూపాయలు వేయడం జరిగిందన్న ఆయన ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, తూము చౌదరి, పెద్ద బాబు, కోనేరు చిన్ని, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, ట్రైని కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ విద్యా చందన, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, పెద్దమ్మతల్లి గుడి చైర్మన్ బాలినేని నాగేశ్వరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగా



సీతారాములు, రైల్వే, టెలికాం, ఆర్టీఐ బోర్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, బోదాసు కనకరాజు, బాదర్ల జోషి, ఐఎన్టీయూసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, మైనారిటీ జిల్లా కార్యదర్శి ఎండి గౌస్ పాషా, కాంగ్రెస్ నాయకులు బాలపాసి, తలుగు అనిల్, పరమేష్ యాదవ్, పోస్ట్ ఆఫీస్ వాసు , కేకే శ్రీను, సుజాతనగర్ మండలం కాంగ్రెస్ అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, కున్సోత్ కిషన్, పూనెం శ్రీనివాస్, బండా వెంకటేశ్వర్లు, అఫ్సర్ ఖాన్, అయూబ్ ఖాన్, కూచిపూడి జగన్, ఐకి సత్యనారాయణ, మహిళ కాంగ్రెస్ నాయకురాళ్లు వాణిరెడ్డి, హైమావతి, జోగు రమాదేవి, యూత్ కాంగ్రెస్ నాయకులు గులాం మతిన్, కసనబోయిన రామ్మూర్తి, పాల సత్యనారాయణ రెడ్డి, సాయి, ప్రణయ్, మతిన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9న జరుగు దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చెయ్యాలి

### ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య - కార్మికుల కోసం పోరాడేది ఏఐటీయూసీ నే




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం జులై 6** సుజాతనగర్ మండలం కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ అన్ని తక్షణమే రెగ్యులేషన్ చేయాలి అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు ఆదివారం మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్లో సుజాతనగర్ గ్రామపంచాయతీ వర్కర్స్ ఏఐటీ యూసీ మండల మహాసభ కూరపాటి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూఒక కార్మికుల కుటుంబం బతకాలంటే కనీస వేతనం 26,000 ఇవ్వాలిఇవ్వాళ మార్కెట్లో ఉన్న రేట్లు కనుగుణంగా కార్మికులు కూడా వేతనాలు పెంచాల్సిన అవసరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారుదేశానికి తోడ్పడుతున్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకూడదని ఆయన డిమాండ్ చేశారు ప్రజా రవాణా ప్రభుత్వ ఆధ్వర్యం లోనే ఉండాలి దేశానికి ఆర్థికంగా తోడ్పడుతున్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకూడదు ప్రైవేటు పరం చేయకూడదు ఎన్నో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను అమలుచేసినాలుగు లేబర్ కోళ్లను తక్షణమే రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు విద్య వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు పండించే పంటకి గిట్టుబాటు ధర ఇవ్వాలి అన్నారు పనికిహార పథకం కింద అదేవిధంగా గ్రామ పంచాయతీలు పనిచేసే కార్మికులకి ఈఎస్ఐ పీఎఫ్ పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి అని తెలిపారు గ్రామపంచా యతీలో పని చేస్తే కార్మికులకి చేతికి గ్లౌజులు కాళ్లకు బూట్లు ముక్కుకు మాస్కో సబ్బులు అందజే యాల్సిన బాధ్యతప్రభుత్వానిదే అన్నారుగ్రామ పంచాయతీ కార్యదర్శుల వర్కర్లు పనిచేసేటప్పుడు పర్యవేక్షణతో తగులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు లేక ప్రైవేట్ పాఠశాల సాధిస్తున్న విద్యార్థులకు ఫీజు కట్టలేక యూనిఫామ్స్ బుక్స్ కొనలేక ఇల్లు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలను విడుదల చేయాలని కోరారు, అనంతరం గ్రామపంచాయతీ వర్కర్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల రాములు, ఏఐటీయూసీ సుజాతనగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు వీర్ల మల్లేష్, కుమారి హనుమంతరావు సిపిఐ మండల కార్యదర్శి దసురు, సహాయ కార్యదర్శి శ్రీను, రైతు సంఘం జిల్లా నాయకులు తాళ్లూరి ధర్మారావు,ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు కేశవరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ గణేష్, ఏఐటీయూసీ ప్రజా సంఘాల నాయకులు సిపిఐనాయకులు గ్రామపంచాయతీ కార్మికులు మహాసభలో పాల్గొన్నారు

### బీరన్న స్వామి బోనాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన

# మంత్రి కొండా సురేఖ,నగర మేయర్ గుండు సుధారాణి

**వరంగల్ జూలై 6**

ఆదివారం వరంగల్ నగరంలోని 12 వ డివిజన్ దేశాయిపేట, 42 వ డివిజన్ లోని రంగశాయి పేట బీరన్న స్వామి బోనాల కార్యక్రమంలో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మాత్యులు శ్రీమతి కొండ సురేఖ, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ నగర ప్రజలందరికీ బీరన్న బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, బీరన్న ఆశీస్సులు నగర ప్రజలందరి పై ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కావేటి కవిత గుండు చందన పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు..



## మాజీ ఎంపీటీసీ ఊడుగుల వెంకటేశ్వర్లను పరామర్శించిన నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి



**తొవ్వ, ప్రతినిధి, నెక్కొండ, జూలై,06:**

నెక్కొండ మండలం అప్పలరావు పేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఊడుగుల వెంకటేశ్వర్లు గారు అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న నర్సంపేట పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి గారు వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి పరామర్శించారు ఈ కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్ నర్సంపేట కోర్టు యేజిపి అడ్వకేట్ బండి శివకుమార్ మండల కాంగ్రెస్ నాయకులు కుసుమ చెన్నకేశవులు ఈదునూరి సాయికృష్ణ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రావుల మహిపాల్ రెడ్డి బొమ్మరమైన రమేష్ అప్పలరావుపేట మాజీ ఉపసర్పంచ్ ఉడుగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



తొవ్వ, ప్రతినిధి, చెన్నారావుపేట, జూలై, 07:

బాధిత కుటుంబాన్ని చెన్నారావుపేట మండల కాంగ్రెస్ నాయకులు ఈ రోజు పరామర్శించారు..చెన్నారావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ గారి బావ ఇస్లావత్ బాలు అనారోగ్యంతో మృతి చెందారు..మొగ్దుపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ బాలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఇస్లావత్ బాలు నాయక్ నివాసానికి చేరుకొని ఆయన పార్ధీవ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు..అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మధు సుధన్ రెడ్డి గ్రామ కాంగ్రెస్ అద్యక్షుడు తాల్లపెల్లి నర్సయ్య గౌడ్ మండల ఉపాధ్యక్షుడు నన్నెబొయిన రమేష్ యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య సొసైటీ మాజీ వైస్ చైర్మన్ చెన్నా రెడ్డి కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్ కుమార్ మహిళ కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బండి పద్మ మాజీ ఎంపిటిసి మహిళ బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి ధోని కమలమ్మ కిసాన్ సెల్ మండల ఉపాధ్యక్షుడు పురం మల్లయ్య ఎర్ర మల్లా రెడ్డి ఉప్పరపెల్లి గ్రామ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అక్కల్ చెడ గ్రామ అధ్యక్షుడు పులిశెరు రాజేందర్ కోనాపురం గ్రామ అధ్యక్షుడు రాజశేఖర్ మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్ మాజీ ఉప సర్పంచ్ బాణోత్ వీరన్న నాయక్ ముత్యం భద్రయ్య భూక్య సురేష్ రవి చెవ్వ వెంకన్న మెంతుల రమేష్ వట్టే శ్రీనివాస్ రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## యువత బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగించాలి

### పూలే ఆశయ సాధన సమితి అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్



**తోవ్వ. డెస్క్.జులై 06**

మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్ రామ్ 114 వ వర్ధంతి సందర్భంగా పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ నివాళులు అర్పించారు. ముందుగా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి, అనంతరం ఆయన మాట్లాడుతూ “అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేసిన మహనీయుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ గారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా,సంఘసంస్కర్తగా రాజకీయ నాయకుడిగా దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. నేటి యువత బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగించాలని అన్నారు.



## నాకు నటన రాదన్నారు

జన్మతహా మలయాళీ అయినా.. తెలుగులోనే ఎక్కువ సినిమాలు చేసింది అనుపమ పరమేశ్వరన్. ఈ విషయం గురించి ఆమె.. తన తాజా మలయాళ సినిమా 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' ప్రమోషన్స్‌లో మాట్లాడింది. 'తెలుగులో ఎక్కువ సినిమాలు చేయడానికీ, మాతృభాష మలయాళంలో తక్కువ సినిమాలు చేయడానికి కారణం లేకపోలేదు. మలయాళం 'ప్రేమమ్' సినిమాతో నా కెరీర్ మొదలైంది. తొలినాళ్లలో నన్ను చాలామంది ట్రోల్ చేశారు. నాకు నటనే రాదన్నారు. ఆ విమర్శలు నాలో కసిని పెంచాయ్. జనానికి నచ్చే సినిమాలే చేయాలని అప్పుడే ఫిక్స్ అయ్యాను. అలాంటి సమయంలో తెలుగులో ఆఫర్లొచ్చాయి. అవి సక్సెస్‌లు కూడా అయ్యాయి. దాంతో అనుకోకుండానే తెలుగులో ఎక్కువ సినిమాలు చేశా. అన్ని ట్రోల్స్ వచ్చినా.. నాపై నమ్మకంతో ఇన్నాళ్లకు మళ్లీ 'జానకి వెర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' వంటి గొప్ప సినిమాకు నన్ను ఎంపిక చేశారు దర్శకుడు ప్రవీణ్ నారాయణ్. నన్ను విమర్శించినవారందరికీ ఈ సినిమా సమాధానమిస్తుంది. ఈ సందర్భంగా నాకు మద్దతు ఇచ్చినవారితోపాటు, నన్ను ద్వేషించినవారికి కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నా.' అని పేర్కొన్నది అనుపమ పరమేశ్వరన్. ఈ నెల 27న అనుమప 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' సినిమా కేరళలో విడుదల కానుంది. సురేశ్ గోపీ లాయర్‌గా నటించిన ఈ చిత్రంలో జానకిగా అనుపమ కనిపించనుంది. 'సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తుంది..' అనేది ఈ సినిమా ఉపశీర్షిక.

## రెండో పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన రేణూ దేశాయ్..



పవన్ కళ్యాణ్ మాజీ భార్య, నటి రేణు దేశాయ్ రెండో పెళ్లి ఎప్పుడు హాట్ టాపిక్‌గానే మారుతూ ఉంటుంది. పవన్ వనుండి విడిపోయిన తర్వాత రేణూ దేశాయ్ మరో పెళ్లి చేసుకోకుండా, తన పిల్లలైన అకీరా నందన్ మరియు ఆధ్యాలతో ఒంటరిగా జీవితం కొనసాగిస్తూ వస్తున్నారు. తాజాగా ఆమె ఒక ఇంటర్వ్యూలో తన రెండో పెళ్లి గురించి స్పష్టత ఇచ్చింది. తాను ఎందుకు ఇప్పటివరకు పెళ్లి చేసుకోలేదో, ఎప్పుడు పెళ్లి చేసుకుంటారో తెలిపింది.ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రేణు దేశాయ్, రెండో పెళ్లి చేసుకోవడానికి తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని, కానీ మరికొన్ని సంవత్సరాల పాటు వెయిట్ చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. రెండు మూడేళ్లలో పెళ్లి చేసుకుంటా. నా జీవితంలో కూడా ఓ మ్యారేజ్ లైఫ్ ఉండాలని, ప్రేమ ఉండాలని కోరుకుంటున్నాను. అందుకే మళ్లీ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను అని స్పష్టత ఇచ్చింది. పిల్లల కోసమే ఇప్పటివరకు పెళ్లి చేసుకోలేదు . నన్ను మళ్లీ పెళ్లి చేసుకోవాలని కుటుంబం నుంచి ఒత్తిడి వచ్చినా, అప్పట్లో పిల్లలు చిన్నవారు కావడంతో వాళ్లను వదిలి కొత్త జీవితం ప్రారంభించడం సబబు కాదు అనిపించింది. వాళ్లకి తండ్రి దూరంగా ఉన్నాడు. నేనూ దూరమైతే వాళ్లు ఒంటరితనంతో బాధపడతారు అనిపించింది అని రేణు భావోద్వేగంగా వివరించారు. అకీరా, ఆద్య కూడా నన్ను మ్యారేజ్ చేసుకోమంటున్నారు. తన పిల్లలు కూడా మద్దతుగా ఉండటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు రేణూ. నా పెళ్లి గురించి పిల్లలు చాలా పాజిటివ్‌గా ఉన్నారు. మమ్మీ, నువ్వు ఎవరితో సంతోషంగా ఉంటావో వాళ్లని పెళ్లి చేసుకో అని చెప్పడం నాకు ధైర్యం ఇచ్చింది. వాళ్లే నన్ను మ్యారేజ్ చేసుకోమని ప్రోత్సహిస్తున్నారు అని రేణూ పేర్కొంది. మరికొన్ని సంవత్సరాల తర్వాత మాత్రమే నాకు పూర్తిగా స్వేచ్ఛ వస్తుంది, అప్పుడు నా జీవితాన్ని కొత్తగా మొదలు పెట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు.

## ఆ వార్తలన్నీ పుకార్లే!



మాజీ దంపతులు నాగచైతన్య, సమంత 'ఏ మాయ చేసావే' రీరిలీజ్ ప్రమోషన్స్‌లో కలిసి పాల్గొనబోతున్నారంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. విడాకులు తీసుకొని ఇప్పటికే నాలుగేళ్లు గడచిపోయాయి కాబట్టి వారి మధ్య అంతగా విభేదాలు లేవని మీడియాలో వార్తలొచ్చాయి. తాజాగా వీటిపై సమంతా స్పందించింది. ఆ వార్తలన్నీ పుకార్లేనంటూ కొట్టిపారేసింది. 'నేను ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొనబోవడం లేదు. అసలు ఈ వార్తలు ఎలా పుట్టుకొస్తాయో అర్థం కావడం లేదు.

## పూరి సినిమాలో సంయుక్త

లైగర్, డబుల్ ఇస్మార్ట్ చిత్రాల అనుభవాలను పాఠాలుగా చేసుకొని, తన కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి ఓ భిన్నమైన కథ రాసుకున్నారు అగ్ర దర్శకుడు పూరీ జగన్నాథ్. కథతోపాటు పాత్రల ఎంపిక విషయంలో కూడా ఆయన విభిన్నంగా వెళ్తున్నారు. ఇప్పటికే కథానాయకుడిగా తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతిని తీసుకున్నారు. సీనియర్ నటి టబుని ఓ కీలక పాత్రకు ఎంపిక చేశారు. రీసెంట్‌గా ఈ ప్రస్టేజియస్ ప్రాజెక్ట్‌లోకి లక్కీ హీరోయిన్ సంయుక్త మీనన్ వచ్చి చేరింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. చిత్ర బృందం ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ పెట్టింది. 'అమె నడకలో హుందాతనం.. కళ్లల్లో ఆగ్రహం..' అంటూ సంయుక్తకు స్వాగతం పలుకుతూ ఆమెతో కలిసి పూరీ, ఛార్మీ దిగిన ఫొటోను ఈ పోస్ట్‌లో పంచుకున్నారు. బాలీవుడ్ నటి రాధిక ఆప్టేని ఈ సినిమాలో ఎంపిక చేసినట్టు గతంలో వార్తలొచ్చాయి. ఇప్పుడు ఆమె స్థానంలోనే సంయుక్త మీనన్‌ని తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ చిత్రానికి 'బెగ్గర్' అనే టైటిల్ ముందు అనుకున్నారు. తాజాగా 'భిక్షాందేహి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# 500 కోట్లతో ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి...

## ఏకలవ్యుడి భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

### స్థానిక సంస్థల్లో ఎరుకల సామాజికవర్గం వారికి అన్ని పార్టీలు అవకాశమివ్వాలి

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్**

**తొవ్వ హైదరాబాద్,జులై 05:**



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ 500 కోట్లతో ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకల సామాజికవర్గానికి చెందిన వారికి అన్ని పార్టీలు రాజకీయంగా అవకాశాలు కల్పించి వారిని గెలిపించుకోవాలని సూచించారు. ఏకలవ్యుడి జయంతి సందర్భంగా ఆదివారం ట్యాంక్ బండ్ పై ఉన్న కొమురం భీమ్ విగ్రహం వద్ద ఏకలవ్యుడి చిత్రపటానికి ఎమ్మెల్సీ కవిత నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేసీఆర్ మొదలుపెట్టిన ఏకలవ్యుడి భవన నిర్మాణాన్ని పూర్తి చేయని దారుణ పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఏకలవ్య భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎరుకల సామాజిక వర్గం అభివృద్ధి కోసం ఎరుకల సాధికారత పథకాన్ని కేసీఆర్ ప్రవేశపెట్టారని, ఆ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని మండిపడ్డారు. పలు సందర్భాల్లో తాను శాసన మండలిలో ఈ అంశాన్ని లేవనెత్తానని, అయినా కూడా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమని స్పష్టం చేశారు. 50 వేల ఎరుకల కుటుంబాలకు రూ 60 కోట్ల మేర లబ్ధి చేకూర్చే ఈ పథకాన్ని మరింత మెరుగుపరిచి ప్రభుత్వం యధాతధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏరుకల సామాజిక వర్గ రాజకీయ అభివృద్ధి కోసం కూడా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకల సామాజిక వర్గానికి అన్ని పార్టీలు సముచిత అవకాశాలు కల్పించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణకు ఎమ్మెల్సీ గా అవకాశం ఇస్తే అప్పటి గవర్నర్ అడ్డుకున్నారని అన్నారు. ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాలపై ఎంతలా అణిచివేత ఉందో చెప్పడానికి ఏకలవ్యుడి జీవితమే ఒక ఉదాహరణ అన్నారు. చరిత్రలో నిలబడిపోయే త్యాగం చేసిన ఏకలవ్యుడు అందరికీ స్ఫూర్తి ప్రధాత అన్నారు. ఆయన



సమాజానికి మంచి మార్గం చూపించే ప్రయత్నం చేసి ఆరాధ్య దైవమయ్యారని కొనియాడారు. బహుజనలకు రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో సమాన అవకాశాలు దక్కాలన్న ఉద్యమంలో తాను పాల్పంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఏకలవ్యుడి విగ్రహాన్ని ట్యాంక్ బండ్ ఏర్పాటు చేయించుకునే ప్రయత్నం చేద్దామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు రూప్ సింగ్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు, ప్రధాన కార్యదర్శి కుతాడి రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, జియాగూడ సబ్జీమండిలోని గోల్కొండ శ్రీ జగదాంబకి ఎల్లమ్మ ఆలయ 51వ వార్షికోత్సవం, బోనాల పండగ ఉత్సవాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో గంగపుత్ర సంఘం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్సీ కవిత పూజలు నిర్వహించారు.

## మాంసం తింటే బీజేపీలో ఉండొద్దంటే ఎలా..?

### దేశభక్తి ఉంటే ఆరెస్సెస్ బజరంగ్ దళ్ లో చేరండి ...

**ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**తొవ్వ ,డెస్క్ జులై 05:**

మాంసం తినే వారు పార్టీలో ఉండొద్దంటే ఎలా.. అందరినీ కలుపుకుపోతేనే పార్టీలో ఉండండి లేదంటే వెళ్ళండి అని ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వికారాబాద్ జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాల య ప్రారంభోత్సవానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కొందరు దేశభక్తిని అడ్డం పెట్టుకొని జిల్లాలో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని మండిప డ్డారు. మీకు దేశభక్తి ఉంటే ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ లో చేరి దేశానికి సేవ



చేయాలి అంతేగానీ బీజేపీ లాంటి రాజకీయ పార్టీలో కొనసాగే అర్హత లేదన్నారు. దేశభక్తి ఉంటే బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్లో చేరండి అందరినీ కలుపుకోకపోతే మీరు పార్టీలో ఉండొద్దు.. ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి సంచలన వ్యాఖ్యలు జిల్లాలోని పార్టీ నాయకులు,



కార్యకర్తలు స్థానిక బీఆర్ఎ స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లా గ్రౌండ్ లెవెల్లో పనిచేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో మోదీ, జిల్లాలో తాను ఎలాగైనా గెలుస్తామని, దానివల్ల మీకు ఉపయోగమేమిటని ప్రశ్నించారు. పా ర్టీలో జిల్లా అధ్యక్ష పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టుల కోసం కోట్లాడడం కాదని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా నుంచి 5వేల వార్డు మెంబర్లు, 540 మంది సర్పంచ్ స్థానాలను గెలిచి చూపించాలన్నారు. అందుకోసం పార్టీ ఇచ్చిన లక్ష్యాలను అధిగమించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, సర్పంచులు, వార్డు మెం బర్లుగా గెలవడానికి మీరు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, నాయకులు వడ్ల నందు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో టిడిపి ప్రభుత్వం...

**తెలంగాణలో పుంజుకుంటున్న టిడిపి...**

**ఎమ్మెల్యే చింతమనేని సంచలన వాక్యాలు...**

**తోవ్వ, ప్రతినిది. జులై 05:**



త్వరలో తెలంగాణ లో టిడిపి అధికారం లోకి రావడం ఖాయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దెందులూరు శాసనసభ్యులు చింతామణి ప్రభాకర్ సంచల వ్యాఖ్యలు చేశారు ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి లోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం లోకి రావడం ఖాయమని అన్నారు. తెలంగాణలో తెలుగుదేశానికి పూర్వ వైభవం తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేష్ కృషి చేస్తున్నారని త్వరలో రాష్ట్ర కమిటీ ప్రకటిస్తారని తెలిపారు




## వందే భరత్ కు తప్పిన పెను ప్రమాదం

**తొవ్వ ,ప్రతినిధి, జులై 05**



మహబూబాబాద్జిల్లాలో ప్రయాణిస్తున్న వందేభారత్ ఎక్స్ప్రెస్ రైలుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుండి సికింద్రాబాద్ వెళ్తున్న వందే భరత్ , తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అప్ లైన్ వద్ద ఒక ఎద్దును ఢీకొట్టింది. ఈ అనూహ్య ఘటనతో రైలు కొన్ని నిమిషాల పాటు అక్కడే నిలిచిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే రైల్వే సిబ్బంది అత్యంత వేగంగా స్పందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, పట్టాలపై పడి ఉన్న ఎద్దు కళేబరాన్ని తొలగించి, రైలు ముందుకు సాగేందుకు మార్గం సుగమం చేశారు. ఈ ప్రమాదంలో రైలు ఇంజన్ ముందు భాగంలో ఉండే క్యాటిల్ గార్డ్ (పశు వుల నుండి రక్షణ కవచం) విరిగింది. డోర్నకల్ %ాఖీ ా.×%. సుభాని సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైలు పట్టాల సమీపంలోకి పశువులను తీసుకురావద్దని స్థానిక రైతులకు ఆయన ప్రత్యేకంగా సూచించారు.

## భార్యను గుండుగీసి.. హత్య చేశారు

### మద్యం మత్తులో భర్త పైశాచిక చర్య...

**హైదరాబాద్ బోరబండలో దారుణ ఘటన....**

**తొవ్వ డెస్క్ .జులై 06:**




మద్యం మత్తులో భార్యకు గుండు గీసి, వివస్త్రను చేసి అత్యంత పాశవికంగా హత్య చేశాడు. ఓ భర్త . ఈ దారుణ ఘటన హైదరాబాద్ పరిధి బోరబండలో జరిగింది. ఓర్సు నర్సింహులు, ఓర్సు సోని(26) దంపతులు సాయిబాబా నగర్లో నివాసం ఉంటుండగా, వీరికి ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు. నర్సింహులుపై పలు పోలీస్ స్టేషన్లలో 16 చోరీ కేసులు ఉన్నాయి. మూడు రోజుల క్రితం బోరబండలోని నాగుల ఎల్లమ్మ ఆలయంలో జరిగిన చోరీ ఇతడే చేసినట్టు గుర్తించిన పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అయితే నర్సింహులు ఇంటికి బయటి నుంచి గడియపెట్టి ఉండటం, భార్య సోని కనిపించకపోవడంతో బంధువులు తలుపుతీసి చూడగా ఆమె అచేతనంగా పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది వచ్చి పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

**రెండురోజులు చిత్రహింసలు..**



సోని జుట్టును తొలగించి, గుండుతో ఉండటమే కాకుండా అక్కడ దుస్తులను కాల్చినట్లు పోలీసులు గుర్తించారు. ఆమె శరీరంపై నర్సింహులు దుస్తులు కప్పి ఉండటంతోపాటు గాయా లున్నాయి. దీంతో నర్సింహులును విచారించగా తానే గుండు చేసినట్లు, వివస్త్రగా మార్చి దుస్తులను దగ్ధం చేసినట్లు ప్రాథమికంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. హుండీలో చోరీ చేసిన సొత్తుతో మత్తులో భార్యను రెండు రోజులుగా తీవ్రంగా కొట్టినట్లు విచారణలో తేలింది. భార్య ప్రైవేట్ భాగాల్లోనూ దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధం

## నియోజకవర్గాల వారీగా మంత్రుల పర్యటనలు

### విభేదాలు పక్కకు పెట్టాలని సూచనలు - ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం




## మహబూబాబాద్ లో మంత్రుల పర్యటన

**తొవ్వ ,ప్రత్యేకం ,జులై 07:**

స్థానిక సమరానికి అధికార కాంగ్రెస్ పార్టీ సన్నద్ధం అవుతోంది. ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా సత్తా చాటి మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతోఅధికార కాంగ్రెస్ ముందుకు సాగుతోంది. ఆ మేరకు క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యకర్తలను పార్టీ పెద్దలు అప్రమత్తం చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏఐసీసీ పరిశీలకులు ఎమ్మెల్యేలతో కలిసి సమావేశాలు నిర్వహిస్తున్నారు. 90 శాతానికి పైగా స్థానాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని, ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు.అలాగే మంత్రులు నియోజకవర్గాల్లో పర్యటించాలని గ్రూపులు ,వర్గపోరు లేకుండా చేయాలనీ ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు జిల్లాలో 18 మండలాలు,నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి.461 గ్రామ పంచాయతీలు 16 పెద్ద పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం గత ఏడాదినరా కాలంగా ముగియగా, మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ఏడాది క్రితం ముగిసింది. మున్సిపాలిటీల పాలక వర్గాల పదవీ కాలం ముగిసింది . అన్నింటి లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతున్నది. బీసీ రిజర్వేషన్ల వ్యవహారం ఎటూ తేలకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అడుగులు ముందుకు పడడం లేదు. బీసీ కులగుణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి పంపించింది. చట్టపరంగా ఆమోదం పొందకపోయినా పార్టీ పరంగా 42 శాతం సీట్లను బీసీలకు కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు.స్థానిక సంస్థల ఎన్నికలను సత్వరమే నిర్వహించాల ని కొందరు మాజీ సర్పంచ్‌లు కోర్టును ఆశ్రయించారు. ఆ మేరకు హైకోర్టు తుది తీర్పును వెలువరించింది. సెప్టెంబరు నెలాఖరు లోపు స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిచేయాలని ఆదేశించింది. అయితే బీసీలకు రిజర్వేషన్లపై ఎలా ముందుకు పోవాలని ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నది. ఏదీ ఎలా ఉన్నా కోర్టు ఆదేశాల మేరకు మూడునెలల్లో ఎన్నికలు పూర్తికావడం ఖాయంగా కనబడుతున్నది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరిగితే జనరల్ స్థానాల్లో కూడా బీసీలు, ఎస్సీలు పోటీచేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే స్థానిక ఎన్నికల్లో పోటీలో ఉంటున్నామని అంతర్గతంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఆయావర్గాలను కలుస్తూ తమ మద్దతు కావాలని కోరతున్నారు.




**- నియోజకవర్గాల స్థాయి సమావేశాలు..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పది, పదిహేను రోజుల్లో రిజర్వేషన్ల విషయమై తేల్చి వరుసగా ఆయా ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నది. ఈక్రమంలో తమ పార్టీ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నది. నియోజకవర్గాల స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ సన్నద్ధం చేస్తున్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ముఖ్యమంత్రి సలహాదారులు వెం నరేందర్ రెడ్డి , అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్ పర్యటించి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు . ఇప్పటికే నియోజకవర్గస్థాయి సమావేశాలు జరిగాయి. ముందుగా ఎన్నికలు జరిగినా అందుకు సంసిద్ధంగా ఉండాలని పార్టీ కోసం పనిచేసే వారికి, గెలుపు గుర్రాలకే పార్టీ టికెట్లు ఇస్తుందని, ఈ పర్యాయమే గాకుండా మరో ఐదేళ్లు కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని చెబుతున్నారు. ఈ స్థానిక సంస్థల్లో 90 శాతం స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని చెబుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయేలా అధిష్టానం పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీ క్యాడర్‌ను అప్రమత్తం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల వ్యూహాలు, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టి స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది.







స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటితేనే మూడున్నరేళ్ల తర్వాత జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రాగలుగుతుందని పార్టీ నాయకులు క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. స్థానికసంస్థల ఎన్నికలు మూడు నెలల్లోగా పూర్తికావడం ఖాయం అని తేలిపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం అవుతున్నారు. పార్టీ టిక్కెట్ల కోసం ఎమ్మెల్యేలను కాకా పడుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు అయిన తర్వాత, ఆ రిజర్వేషన్లను బట్టి అభ్యర్థులను ఖరారు చేయనున్నారు.




---

ఆరోగ్యమే...మహాభాగ్యం

## ఎం.... గురు మద్యం మాన లేకపోతున్నారా .....

మద్యం శరీరాన్ని ఆరోగ్య పరంగా, కుటుంబాన్ని ఆర్థిక పరంగా తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఈ విషయం తెలుసుకునే సరికే వ్యవహారం చాలా దూరం వెళ్లిపోయి ఉంటుంది. తాగడం బంద్ చేయాలని అనిపిస్తున్నప్పటికీ.. తమ వల్ల కావట్లేదంటూ చేతులు ఎత్తేస్తుంటారు. ఇలాంటి వారు కొన్ని టిప్స్ పాటించడం ద్వారా మందు మానేయడం సాధ్యమే అంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు చూద్దాం.మద్యం తాగడం వల్ల ఎన్నో రకాల అనారోగ్యాలు చుట్టు ముడతాయి. దీర్ఘకాలం మందు తాగడం వల్ల కాలేయం దెబ్బ తింటున్నది. ఇంకా.. రొమ్ము, పేగు క్యాన్సర్లు సహా అనేక రకాల క్యాన్సర్లు ఎటాకే చేస్తాయి. హై-బ్లడ్ ప్రెషర్, షుగర్, ఆట్రియల్ ఫైబ్రిలేషన్ వంటి గుండె సంబంధింత సమస్యలూ వస్తాయి. అయితే.. తాము రోజూ తాగట్లేదని, వీకెండ్స్? లో మాత్రమే గ్లాస్ పట్టుకుంటున్నామని కొందరు చెబుతారు. కానీ.. మద్యం ఎంత తక్కువ తాగినా, ఆరోగ్యానికి ముప్పేనని "హార్వర్డ్ మెడికల్ స్కూల్"కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ జాన్ ఎఫ్. కెల్లీ అంటున్నారు. అందుకే.. మద్యం తాగడం మానేయాల్సిందేనని చెబుతున్నారు. అయితే.. ఒకేసారి మానేస్తే, కొన్ని రోజుల్లోనే తిరిగి మొదలు పెట్టే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే.. ఒక పద్ధతి ప్రకారం దూరం పెట్టాలని సూచిస్తున్నారు.



**తిన్న తర్వాత తాగండి..**

మద్యం ఖాళీ కడుపుతో తాగడం చాలా ప్రమాదం. దీనివల్ల వేగంగా మత్తులోకి వెళ్లిపోతారు. ఆ మత్తులో మరో పెగ్గు, ఇంకో పెగ్గు, ఇంకా, ఇంకా అంటూ వెళ్లిపోతారు. అందుకే.. తినకముందు తాగకూడదని సూచిస్తున్నారు. తప్పకుండా కడుపు నిండా తిన్న తర్వాత తాగాలని సూచిస్తున్నారు. దీనివల్ల మీరు ఎక్కువగా మద్యం తీసుకునే వీలు ఉండదు. మనసు కూడా ఎక్కువగా తాగాలని ఆరాటపడదు. పొట్టలో ఎలాగో ఆహారం ఉంది కాబట్టి.. డ్యామేజ్? తీవ్రత కాస్త తగ్గుతుంది. ఫైనల్?గా మీరు మందు మానేయాలని భావిస్తున్నారు కాబట్టి.. తక్కువతోనే ఆపేయాలనే స్పృహ ఉంటుందని సూచిస్తున్నారు.



**ఇలా చేయండి**

నిత్యం మద్యం తాగేవారు ఉన్నట్టుండి పూర్తిగా తగ్గించడం సాధ్యం కాకపోవచ్చు. అదే సమయంలో అసలు తాగకుండా ఉండలేరు. కాబట్టి ఆల్కహాల్ ఎక్కువగా ఉండే మీ బ్రాండ్? మార్చేయాలని సూచిస్తున్నారు. ఆల్కహాల్? పర్సంటేజ్ తక్కువగా ఉండే వైన్? లాంటి పానీయాలను ఎంచుకోవడం మంచిదని చెబుతున్నారు. మార్కెట్లో ఇలాంటి ఆప్షన్స్? చాలానే ఉన్నాయి. ఇలా బ్రాండ్? మార్చడం వల్ల మీ శరీరంలోకి వెళ్లే ఆల్కహాల్ పర్సంటేజ్ తగ్గుతుంది. తాగామనే ఫీలింగ్ కూడా ఉంటుంది. క్రమంగా దీన్ని కూడా తగ్గిస్తూ పోవాలి.

**ఇంట్లో అసలు మందు ఉండొద్దు**

నిత్యం మందు తాగేవారిలో చాలా మంది ఇంటికి కూడా క్యారీ చేస్తుంటారు. వాళ్ల ఇంట్లో మందు స్పేర్?గా ఉంచుతారు. తాగడం బంద్ చేయాలని అనుకునేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంట్లో మద్యం ఉంచకూడదు. పక్కనే ఉన్నప్పుడు తాగాలనే కోరిక ఎక్కువగా కలుగుతుంది.

**పార్టీలను బై బై చెప్పండి**

మిత్రులైనా, ఫ్యామిలీ పార్టీలు అయినా ఏర్పాటు చేసినప్పుడు వాటికి దూరంగా ఉండండి. ఫంక్షన్లకు దూరంగా ఉన్నప్పుడు మద్యం తాగాలనే కోరిక పెద్దగా ఉండదు. కానీ.. ఫంక్షన్లకు వెళ్లి, మద్యం తాగేవారిని కలిసినప్పుడు ఆ కోరిక ఒక్కసారిగా పెరిగిపోతుంది. తోటివారు బలవంతపెడితే తప్పని పరిస్థితుల్లో తాగేస్తుంటారు. అందుకే.. ఇలాంటి పార్టీలను స్కిప్ చేయాలని సూచిస్తున్నారు. ఒకవేళ అనివార్యంగా వెళ్లాల్సి వస్తే.. మద్యం తాగాలని ఎవరైనా బలవంతం చేస్తే.. డాక్టర్? మందు మానేయాలని సీరియస్?గా చెప్పారు అని చెప్పండి. అప్పుడు మిమ్మల్ని ఎవరూ బలవంతం చేసే అవకాశం ఉండదు.

**రోజు వ్యాయామం చేయండి**

లవ్యాయామం చేయడం వల్ల మనలో అద్భుతమైన ఎనర్జీ వస్తుంది. ఇది మందు మీదకు మనసు మళ్లకుండా చూస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఎక్సర్? సైజ్? ఎంతో ఎఫెక్టివ్?గా పనిచేస్తుందని సూచిస్తున్నారు. దీంతోపాటుగా డైరీ రాసుకోవాలని.. అందులో మీ ఆరోగ్యం గురించి, కుటుంబ బాధ్యతలు, పిల్లల భవిష్యత్తు గురించి రాసుకోవాలని, వాటిని తరచూ చూసుకుంటూ ఉండాలని సూచిస్తున్నారు. ఈ పనులు పక్కాగా చేస్తే.. మీరు మద్యం మానేయడం కూడా తప్పకుండా జరిగి తీరుతుందని చెబుతున్నారు.